## కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక పూర్తి

హైదరాబాద్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో 15,750 కానిస్టే బుల్ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక పూర్తయినట్టు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్పీఆర్బీ) ప్రకటించింది. మొత్తం 16,604 ఖాళీ లకు 12,866 మంది పురుషులు, 2,884మంది మహిళా అభ్యర్థులను ఎంపిక చేసినట్టు తెలిపింది. ఎంపికైనవారు ఈ నెల 12, 13న సంబంధిత ధ్రువప త్రాలు జతచేసిన అటెస్టేషన్ ఫాంను పూర్తిచేసి సంబంధిత జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సమర్పించాలని సూచించింది. 100 డ్రైవర్ పోస్టులు, 225 ఫైర్ సర్వీసెస్ డ్రైవర్ పోస్టులకు సంబంధించి కోర్టు కేసు పరిష్కారం తరువాత నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు వివరించింది.



బొగ్గులకుంటలో మీడియాతో మాట్లాడుతున్న అర్చక సంఘం నాయకులు

## మరో 350 ఆలయాలకు 'ధూప దీప నైవేద్యం'

- 6,271కి చేరిన డీడీఎన్ పథకం ఆలయాలు
- ఈ నెల నుంచే 10 వేల గౌరవ వేతనం అమలు
- అర్చక, ఉద్యోగ సంఘాల జేఏసీ హర్షం

హైదరాబాద్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో 350 ఆల యాలకు ధూప దీప నైవేద్య పథకాన్ని (డీడీఎన్) వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్త ర్వులు జారీచేసింది. దీంతో రాష్ట్రంలో ఈ పథకం అమలవుతున్న ఆలయాల సంఖ్య 6,271కి చేరింది. ఈ నెల నుంచే డీడీఎన్ ఆలయాలకు ప్రతి నెలా రూ.10 వేల చొప్పున గౌరవ వేతనాలు ఇవ్వనున్నారు. ఇవికాకుండా 3,500 ఆలయాల్లో అర్చకులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు ఇస్తున్నారు. దీంతో 9,771ఆలయాలకు ప్రభుత్వ సహకారం ద్వారా ధూప దీప నైవేద్య కార్యక్రమాలు అమలవుతున్నాయి. మరో 250 ఆలయాలకు త్వరలో ఈ పథ కాన్ని వర్తింపజేసేందుకు దేవాదాయ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రభుత్వ ఆమోదం పొందితే రాష్ట్రంలోని మొత్తం ఎంపికచేసిన 11,000 పైచి లుకు ఆలయాలకు డీడీఎన్ పథకం వర్తించనున్నది. హైదరాబాద్ బ్రాహ్మణ సదనం ప్రారంభం సందర్భంగా సీఎం కేసీఆర్ డీడీఎన్ అర్చకుల గౌరవ వేత నాన్ని రూ.6000 నుంచి రూ.10,000కు పెంచుతున్నట్టు ప్రకటించారు. ఆ హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,271 డీడీఎన్ ఆలయాలకు ఈ నెల నుంచే రూ.10 వేల చొప్పున వేతనం ఇవ్వనున్నట్టు అధికారులు వెల్లడించారు.

**ఆలయాల అభివృద్ధికి కేసీఆర్ విశేష కృషి: అర్చక, ఉద్యోగ జేఏసీ**

రాష్ట్రంలో ఆలయాజేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో బుధ వారం బొగ్గులకుంటలోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కార్యాలయంలో బుధ వారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అర్చక సంఘాల నాయకులు మాట్లాడారు. కొత్తగా 350 ఆలయాలకు డీడీఎన్ పథకాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. డీడీఎన్, గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా సుమారు 10 వేల ఆలయాల్లో ప్రభుత్వ సహకా రంతో ధూప దీప నైవేద్య కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. మిగతా ఆలయాలకూ త్వరలోనే ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. సమావే శంలో రాష్ట్ర దేవాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొండూరి కృష్ణమాచారి, జేఏసీ సభ్యులు మఠం శివకుమార్, భద్రినాథాచార్యులు, పరాశరం రవీంద్రా చారి, అగ్నిహోత్రం చంద్రశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.

## 9 నుంచి ఎంటెక్, ఎంఫార్మసీ ఫస్టియర్ తరగతులు

- జేఎన్టీయూ విద్యాక్యాలెండర్ విడుదల

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాదికి ఎంటెక్, ఎంఫార్మసీ ఫస్టియర్ విద్యాక్యాలెండర్‌ను జేఎన్టీయూ విడుదల చేసింది. 9 నుంచి మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభిస్తామని రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్ తెలిపారు. 23 నుంచి 28 వరకు దసరా సెలవులుంటా యని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 4 నుంచి 19 వరకు ఎంటెక్ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్టు వివరించారు. అలాగే వచ్చేఏడాది మార్చి 20 నుంచి రెండో సెమిస్టర్ క్లాసులు ప్రారంభించి, ఆగస్టు 19 నుంచి 31 వరకు రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. వచ్చేఏడాది మార్చి 15 నుంచి 30 వరకు ఎంఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్షలుంటాయని పేర్కొన్నారు. రెండో సెమిస్టర్ తరగతులు ఏప్రిల్ 1 నుంచి నిర్వహిస్తామని చెప్పారు. సెప్టెం బర్ 17 నుంచి 28 వరకు రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నామని రిజి స్ట్రార్ తెలిపారు. వచ్చేఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 12 వరకు మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. మార్చి 14 నుంచి రెండో సెమి స్టర్ తరగతులు ప్రారంభించి, ఆగస్టు 19 నుంచి 31వరకు రెండో సెమిస్టర్ పరీ క్షలుంటాయని వివరించారు. క్యాలెండర్ వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్ర దించాలని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

## వారాహి యాత్రపై రాళ్లదాడి ప్లాన్ ఎవరిది?

- సమాచారం ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పండి
- జనసేన అధినేతకు పోలీసుల నోటీసులు

హైదరాబాద్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు బుధవారం ఏపీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. కృష్ణా జిల్లాలో కొనసాగుతున్న వారాహి యాత్రపై రాళ్ల దాడికి ప్లాన్ చేశారని తనకు సమాచారం అందిందంటూ పవన్ కల్యాణ్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో నోటీసులు ఇచ్చా మని కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా వెల్లడించారు. పవన్ నుంచి ఎలాంటి స్పందన రాలేదని చెప్పారు. అసత్యపూరిత ప్రచారం చేయడం సరికాదని సూచించారు. మచిలీపట్నంలో జనసేన భరోసా కార్యక్రమంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తన యాత్రను అడ్డుకునేందుకు ప్రభుత్వం చూస్తున్నదని ఆరోపించారు. సభలో ఎలాంటి అలజడులు సృష్టించినా ప్రభుత్వానిదే బాధ్యత అని హెచ్చరించారు.

మరిన్ని వార్తలు
ntnews.com లో చూడగలరు




















